

తిరుమలగిరిలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

# సీఎం కేసీఆర్ బహిరంగ సభా స్థలం పరిశీలన

తిరుమలగిరి, అక్టోబర్ 16 : ఈనెల 29న తిరుమలగిరి చౌరస్తాలోని సూర్యాపేట రోడ్డులో నిర్వహించే సీఎం కేసీఆర్ తుంగతుర్తి సమర శంఖారావం బహిరంగ సభ కోసం స్థలాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సభకు అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు వస్తారన్నారు. వారి వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేంద్రనాథ్ ఉన్నారు.



వివిధ పార్టీలకు చెందిన నాయకులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

# అభివృద్ధి, సంక్షేమం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్
- బీఆర్‌ఎస్‌లో పలువురు చేరిక

తిరుమలగిరి, అక్టోబర్ 16 : అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. సోమవారం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాలీపురం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మూల వెంకన్న, జెట్టి వెంకన్న, వెంటేశ్వర్లు, వీరన్న, మధుసూధన్‌రెడ్డి, వంగురి సోమయ్య, మల్లయ్య, చంద్రయ్య, వెంకన్నతో పాటు పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, యాదగిరి, సురేందర్, కౌన్సిలర్ శ్రీలత, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేంద్రనాథ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# అభివృద్ధిని గడపగడపకూ వివరించాలి

- పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కుంట్ల సురేందర్‌రెడ్డి

అర్వపల్లి, అక్టోబర్ 15 : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను గడపగడపకూ వివరించి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కొమ్మాలలో బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. మూడోసారి ఎమ్మెల్యే కిశోర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధరి వెంకటమ్మావెంకటయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు కుక్కడపు సైదులు, ప్రవీణ్, శ్రీనివాస్, వీరారెడ్డి, సత్తయ్య, వార్డు సభ్యులు రవి, ఉపేంద్ర, శ్రీను, ఉదయ్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- గురుకుల ఓఎస్‌డీ ప్రశాంతి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఓఎస్‌డీ ప్రశాంతి

తుంగతుర్తి, అక్టోబర్ 16 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని గురుకుల ఓఎస్‌డీ ప్రశాంతి అన్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలో గురుకుల పాఠశాల, కళాశాలలో 9వ జోనల్ స్పోర్ట్స్ మీట్ సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు 800ల మందికి పైగా విద్యార్థులు పాల్గొని క్రీడల్లో రాణించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఓ పుండరీక చారి, ప్రిన్సిపాల్ శ్యామలత, శమంతకమణి, సునీత, మంజుల, రాధాకృష్ణ, కవితా, రాణి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీదేవి పాల్గొన్నారు.

# తుంగతుర్తి అభివృద్ధి ఘనత ఎమ్మెల్యే కిశోర్‌దే

- కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలం
- కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి మోసపోవద్దు
- బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో చూసి ప్రతిపక్షాల గుండెల్లో ఓటమి భయం
- ఎమ్మెల్యే కిశోర్‌ను మూడోసారి ఆశీర్వదించాలి
- అర్వపల్లి ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



అర్వపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

అర్వపల్లి, అక్టోబర్ 16 : తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత గాదరి కిశోర్‌దేనని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఎన్నికల ప్రచారాన్ని అర్వపల్లిలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాదరి కిశోర్, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపికాయుగందర్‌రావుతో కలిసి యోగానంద లక్ష్మీనర్సింహ్మాస్వామి ఆలయంలో బీఫామ్‌ను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం నుంచి అర్వపల్లి వై జంక్షన్ వరకు కోలాటాలు ఆట పాటలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో తుంగతుర్తి నియోజకవర్గం కక్షలు, రక్తపు మరకలతో రగిలిపోయేదని, ఏ ఊరికి వెళ్లినా సమాధులు, స్థూపాలే దర్శనిచ్చాయన్నారు. కానీ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రక్తం పారిన నేలలో కాళేశ్వరం జలాలు పారుతూ ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఎక్కడ చూసినా నిండుకుండలా చెరువులు, కుంటలు దర్శనమిస్తున్నాయన్నారు. రైతు బంధు పథకం దేశంలోనే గొప్ప పథకమని అభివర్ణించారు. యువతకు ఉపాధి కల్పించడం కోసం ఇండస్ట్రీయల్ పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 60యేండ్లలో అధికారంలో కాంగ్రెస్ పార్టీ చేయని అభివృద్ధి పది సంవత్సరాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. రూ.6వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత కిశోర్‌దేనని కొనియాడారు. ప్రజల ఆలోచనల విధానాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోని ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి రాగానే అమలు చేయనున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో ప్రతిపక్షాల గుండెల్లో ఓటమి భయం పట్టుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి పోటీ చేయడానికి అభ్యర్థులే కరువయ్యారని తెలిపారు. గాదరి కిశోర్ 50వేల మెజార్టీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు.

అంతకు ముందు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేను జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కాసోజు శంకరమ్మ, రైతు బంధు సమితి జిల్లా కో ఆర్డినేటర్ ఎస్ఏ రజాక్, తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మినేని స్రవంతీసతీశ్, ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్, పార్టీ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, మొరిశెట్టి ఉపేందర్, సర్పంచ్ బైరబోయిన సునీతారామలింగయ్య, ఎంపీటీసీ కనుకు పద్మాశ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## కిశోర్ హ్యాట్రిక్ విజయం ఖాయం

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

ఇది ఎన్నికల ప్రచారంలా లేదని, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ విజయోత్సవ ర్యాలీల ఉందని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. ఎమ్మెల్యే మంచి జోష్ మీద ఉన్నాడని, హ్యాట్రిక్ విజయం ఖాయమని తెలిపారు.

## భారీ మెజార్టీ ఇవ్వాలి

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి ఆశీర్వాదంతో తనకు మూడోసారి బీఫామ్ లభించిందని, రెండుమార్లు ప్రజలు ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించారని, మూడోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీ ఇవ్వాలని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కోరారు. శక్తి వంచన లేకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేశానన్నారు. రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్వపల్లి యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆశీస్సులు పొంది తాను గతంలో సైతం ప్రచారాన్ని ప్రారంభించానని, భగవంతుని ఆశీర్వాదం, ప్రజల ఆశీస్సులతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

## సహజ కాన్పులపై అవగాహన



సహజ కాన్పులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వందన

తిరుమలగిరి, అక్టోబర్ 16 : తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు సహజ కాన్పులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు వందన మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయడంతో పాటు, క్రమం తప్పకుండా ప్రభుత్వ దవాఖానల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్ రామచంద్రు, స్వరూపాకుమారి, విజయ్, రమాదేవి పాల్గొన్నారు.

## నల్లగొండలో ఇరువర్గాల ఘర్షణ

నల్లగొండ సిటీ, అక్టోబర్ 16: నల్లగొండ పట్టణంలోని ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణ కేసులో 12 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ అపూర్వరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాన్యంచెల్కకు చెందిన షేక్ హసనుద్దీన్ అలియాస్ హస్ను కొన్ని రోజులుగా కన్సల్టెన్సీ నడుపుతున్నట్లు పేర్కొన్నాడు. స్థానికులకు వీసా ఇప్పించి విదేశాలకు పంపుతుంటాడు. ఈ క్రమంలో మాన్యం చెల్కకు చెందిన ముదసిర్ అహ్మద్ అలియాస్ అబ్దుల్లా వద్ద రూ.1.10 లక్షలు తీసుకొని కతార్ పంపడానికి ఒప్పందం చేసుకున్నాడు. అనంతరం వీసా ఏర్పాటు చేశాడు. కరోనా లాక్‌డౌన్ కారణంగా వీసా గడువు ముగిసింది. ముసిదర్ తన డబ్బులు తిరిగి ఇవ్వాలని హసనుద్దీన్‌ను పలుసార్లు అడిగినప్పటికీ డబ్బులు ఇవ్వలేదు. దాంతో అహ్మద్ తన స్నేహితుడు రౌడీ షీటర్ షేక్ చాంద్‌కి విషయం తెలుపడంతో చాంద్ ఆయనతో హసనుద్దీన్ బెదిరించాడు. ఈవిషయంపై మాట్లాడుకుందామని ఇరువర్గాలు లిటిల్ ఫ్లవర్ స్కూల్ సమీపంలో వచ్చారు. మాటమాటా పెరిగి మారణాయుధాలతో దాడులు చేసుకున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

## 19 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ, కోలాట పోటీలు

నాగారం, అక్టోబర్ 16 : దసరా, బతుకమ్మను పండుగల సందర్భంగా మండలంలోని పస్తాలలో ఈ నెల 19 నుంచి 21 వరకు రాష్ట్రస్థాయి కబడ్డీ, కోలాట క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీలో ప్రథమ బహుమతి రూ.20,016, ద్వితీయ 18,016, తృతీయ 16,016, చతుర్థ 14,016, పంచమ బహుమతి 12,016, కోలాట పోటీల్లో ప్రథమ బహుమతి రూ.10,016, ద్వితీయ 8,016, తృతీయ 5,016, చతుర్థ 3,016 అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని, వివరాలకు 9010996600, 7780446175 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు తిమ్మాపురం విద్యార్థినులు

అర్వపల్లి, అక్టోబర్ 15 : మండలంలోని తిమ్మాపురం జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన దోమల రేష్మ, వేములకొండ సుప్రియ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లొడంగి సైదులు తెలిపారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.